క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేది ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి అనంతరం స్వామివారి శాంతి కల్యాణం ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళ వాయిద్యాల నడుమ కన్నుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు పెద్దింటి వేంకట శ్రీనివాస్, పీ రామశేషాచార్యులు, వేద పండితులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్య భక్తులు తిలకించారు. భక్తులకు లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

వారాహిమాతకు ప్రత్యేక పూజలు



వానపల్లిలో వారాహిమాతకు పూజలు చేస్తున్న పండితుడు శివాజీ, మహిళలు

కొత్తపేట: వానపల్లి గ్రామంలో వారాహిమాత అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు వెలువల శివరామ్ (శివాజీ) ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం కల్యాణ మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలకు గాజులు, రవికలు అందజేశారు. గురువారం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పండితుడు శివాజీ తెలిపారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎండు గడ్డి ట్రాక్టర్ దగ్ధం



కె.వి.పాలెంలో కాలిపోయిన గడ్డి ట్రాక్టర్

అంబాజీపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గడ్డితో ఉన్న ట్రాక్టర్ కాలిబూడిదైంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కుందాలపల్లికి చెందిన ట్రాక్టర్ పప్పులవారిపాలెం నుంచి 2 ఎకరాల ఎండు గడ్డి లోడుతో స్థానిక కొర్లపాటివారిపాలెంకు వస్తుంది. ఈ సమయంలో విద్యుత్ వైర్లు గడ్డి ట్రాక్టర్‌కు తగిలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగిపోవడంతో ఎండి గడ్డితో పాటు ట్రాక్టర్ ట్రక్ పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.80 వేల ఆస్తి నష్టం సంభవించింది. అమలాపురం అగ్నిమాపక అధికారి వై.కొండబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా కె.వి.పాలెంవీధిలో నిప్పంటుకున్న గడ్డి ట్రాక్టర్‌ను డ్రైవర్ చాకచక్యంగా ఖాళీ ప్రదేశంలోకి తీసుకువెళ్లి వదిలేశాడు. దాంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవీ భూదేవి సమేత కేశవస్వామివారు

అయినవిల్లి: ముక్తేశ్వరంలోని ముక్తికాంతక్షణ ముక్తేశ్వరుని ఆలయంలో ఉనర్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారికి బుధవారం భక్తిశ్రద్ధలతో ఉత్పన్న ఏకాదశి పూజలు చేశారు. ఆలయ అర్చకులు అంగర రవికాంత్, సాయిపవన్‌ల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణునికి ఆలయ నిర్వాహకులు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. అయినవిల్లి సీతారామచంద్రస్వామివారి ఆలయంలోను విశేష పూజలు జరిపారు.

ఇంత మోసమా?

- కూటమి ప్రభుత్వం తీరుపై వలంటీర్ల మండిపాటు
- రూ.10 వేలు ఇస్తామన్నారని ఆవేదన
- న్యాయం చేయాలని డిమాండ్



పెదపట్నంలో వరద బాధితులకు కూరగాయలు అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

మామిడికుదురు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చిన వలంటీర్లు కూటమి ప్రభుత్వం తమను దారుణంగా మోసం చేసిందని తీవ్రంగా మండి పడుతున్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారికి ఇచ్చే వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతోనే తాము వలంటీర్లుగా పని చేశామని, ఏ పార్టీకి తాము అనుకూలంగా పని చేయలేదని అన్నారు. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలు ముగిసిన తర్వాత మరొక మాట మాట్లాడడం సరి కాదని పేర్కొంటున్నారు. వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగిందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ దిశగా కార్యాచరణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో 4,444 మంది

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో మొత్తం 4,444 మంది వలంటీర్లు గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు సేవలందించారు. 50 గృహాలకు ఒకరు వంతున ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేశారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 1521 మంది, కొత్తపేట నియోజకవర్గంలో 1706 మంది, రాజోలు నియోజకవర్గంలో 1217 మంది వలంటీర్లుగా సేవలందించారు. ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారు జామున పెన్షన్ అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ నేరుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందజేసేవారు. ప్రస్తుతం వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేయడంతో ఈ విధులను ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో చేయిస్తోంది. తమకు పనిభారం పెరిగిపోయిందని ఒక పక్క సచివాలయ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా వారి ఆవేదనను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించి వారికి న్యాయం చేయాలని ఒక వైపు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తమను కొనసాగించి తమకు ఉపాధి కల్పించాలని వలంటీర్లు కోరుతున్నారు.

మానవత్వంతో సేవలందించాం



ప్రజలకు సేవ చేసే అదృష్టం లభించిందన్న ఆనందంతో మేము వలంటీర్లుగా సేవలందించాం. గత ప్రభుత్వం మాకు ఇచ్చింది కేవలం రూ.5 వేలు మాత్రమే. దానికన్న రెట్టింపు సేవ చేశాం. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని కూటమి నేతలు గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కడా ఆ మాట మాట్లాడడం లేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించి మమ్మల్ని ఆదుకోవాలి.

– యేడిద భానుమూర్తి, పెదపట్నంలంక

రాజకీయాలకు అతీతంగా సేవ చేశాం



వలంటీర్లుగా రాజకీయాలకు అతీతంగా మేము సేవ చేశాం. మేము ఎక్కడా రాజకీయాలు చేయలేదు. ఒక పార్టీకి అనుకూలం కానీ, మరొక పార్టీకి వ్యతిరేకంగా కానీ మేము నడుచుకోలేదు. కానీ మా మీద రాజకీయ ముద్ర వేశారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు మాకు భరోసా ఇచ్చారు. ఆ హామీని నిలుపుకొని మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం. డిగ్రీలు చదివి కేవలం మా ఉపాధి కోసమే వలంటీర్లుగా పని చేశాం.

– గోగు క్రాంతికుమార్, పెదపట్నం

హామీని అమలు చేయాలి



రాజకీయాల కోసం మమ్మల్ని బలి పశువులను చేస్తున్నారు. మేము రాజకీయాలకు అతీతంగా వలంటీర్లుగా సేవ చేశాం. మాకు ప్రభుత్వం ఇచ్చింది తక్కువ మా చేత చేయించుకున్న సేవ ఎక్కువ. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, మాకు ఇచ్చే వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే కూటమి విజయం సాధించింది. ఇచ్చిన హామీ ప్రకారం వేతనం పెంచి వలంటీర వ్యవస్థను కొనసాగించాలి.

– పైడి రమేష్, పెదపట్నం

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం



లబ్ధిదారులతో జంపన బుజ్జిరాజు తదితరులు

మలికిపురం: అనారోగ్యంతో ఉన్న ఇరువురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాల చెక్కులను బుధవారం మలికిపురంలోని వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో బాధితులకు అందించారు. లంక రమేష్ (కేశవదాసుపాలెం) రూ.10వేలు, గెడ్డం సత్యవతి(సఖినేటిపల్లి)ల రూ.10 వేలను సాయంగా అందించారు..ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజుతోపాటు, సఖినేటిపల్లి సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు,అటారం మాష్టారు, కొల్లాబత్తుల చిన్ని ఆయా గ్రామాల్లోని పెద్దలు పాల్గొన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తాము ఎవరో తెలియక పోయినా సాయం అందించిన వెంకట రామరాజుకు కతజ్ఞతలు తెలిపారు.

కొత్తపేట కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా విద్యాప్రసన్న



ఇన్‌చార్జి ఏజీపీ బూసి విద్యాప్రసన్న

కొత్తపేట: కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా బూసి విద్యాప్రసన్న నియమితులయ్యారు. ఆ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి వీ మధన్‌మోహన్ రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు విద్యాప్రసన్న తెలిపారు. ఇంత వరకూ ఇక్కడ ఏజీపీగా పని చేసిన ప్రముఖ న్యాయవాది జీ విజయ పదవీకాలం పూర్తి కావడంతో ఆలమూరు కోర్టు ఏజీపీగా పని చేస్తున్న ప్రముఖ న్యాయవాది విద్యాప్రసన్నను కొత్తపేట కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా నియమించారు. కొత్తపేట కోర్టుకు నూతన ఏజీపీని నియమించే వరకూ విద్యాప్రసన్న ఆలమూరు కోర్టుతో పాటు కొత్తపేట కోర్టు ఇన్‌చార్జి కొనసాగుతుంది. ఇటీవల ఆలమూరు కోర్టు ఏజీపీగా, తాజాగా కొత్తపేట కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా నియమితులైన విద్యాప్రసన్నను పలువురు అధికారులు, న్యాయవాధులు, నాయకులు అభినందించారు.

వైభవంగా లక్ష పత్రిపూజ



కొత్తపేటలో రాజేశ్వర స్వామికి రుద్రాభిషేకం జరిపిస్తున్న సలాది చిన్ని దంపతులు



మోడేకుర్రులో భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామికి విశేష అలంకరణ

కొత్తపేట: స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత రాజేశ్వర స్వామివారికి నియోజకవర్గ కాపునాడు నాయకుడు సలాది రామమోహనరావు (చిన్ని) దంపతుల ఆధ్వర్యంలో బుధవారం వివిధ అభిషేక, పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కోనసీమ ప్రాంతంలో ప్రముఖ వేదపండితులు సలాది చిన్ని దంపతులతో పాటు పలువురు ఉదయం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు, మధ్యాహ్నం నుంచి లక్షపత్రి పూజ, రాత్రి దీపాలంకరణ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులకు మధ్యాహ్నం అల్పాహారం, రాత్రి అన్నసమారాధన జరిపారు.

మోడేకుర్రులో విశ్వేశ్వరస్వామికి..

మోడేకుర్రు గ్రామంలో ఉన్న భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామివారికి లక్షపత్రి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వ్యాఘ్రేశ్వరంలో..

అంబాజీపేట: వ్యాఘ్రేశ్వరంలో బాలా త్రిపుర సుందరి సమేతవ్యాఘ్రేశ్వరస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలోను, మాచవరంలో పార్వతి రాజరాజేశ్వరీ స్వామి, కందుల మల్లేశ్వర స్వామి వారికి బుధవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. వక్కలకంలో అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలోను, ఇరుసుమండ గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మాచవరం, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, నందంపూడి, తొండవరం, వాకలగరువు, చిరతపూడి, ఇసుకపూడి, ఇరుసుమండ, ముక్కామల, కముజువారిలంక, వక్కలంక, పసుపల్లి, మొసలపల్లి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో పూజలు జరిగాయి

బాల్య వివాహాలతో అనర్థాలు



కొత్తపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తదితరులు

కొత్తపేట: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలున్నాయని సీనియర్ న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు ఏటీ ప్రభాకరరావు, వీ బాలప్రతాప్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పీ శారద విద్యార్థులకు అన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో కొత్తపేట లీగల్ సెల్, ఐసీడీఎస్ వారి సౌజన్యంతో బాల్యవివాహాల నివారణ, సైబర్ చట్టాలు అంశాలపై బుధవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయవాదులు ఏటీ ప్రభాకరరావు, వీ బాలప్రతాప్, సీడీపీఓ శారద ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాల వలన జరిగే అనార్థాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత బాల్య వివాహాల నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయి? ఆ మోసాలకు గురి కాకుండా ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి? సైబర్ చట్టాలు గురించి అవగాహన కల్పించారు. ఈ మోసాలకు గురైనప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన నంబర్లకు సంబంధించి పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ సీహెచ్ నాగరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ కే చంద్రకళ, జే సుల్తానా బేగం, ఎస్‌కే పాతిమా, జీ సత్యవేణి అధ్యాపకులు ఏ దీపికాదేవి, వీ నాగదీపిక, సీహెచ్ నాగశ్రీలక్ష్మి, ఎం.హేమలత, ప్రసన్నజ్యోతి, నాగజ్యోతి, భవాని, కావ్య, సుకృద వల్లి, సత్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని కూలిన విద్యుత్ స్తంభం



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అయినవిల్లి: గ్రామంలోని ఆదర్శనగర్ వద్ద విద్యుత్ స్తంభాన్ని బుధవారం లోడు వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఒక్క సారిగా విద్యుత్ స్తంభం నేలకూలింది. దీంతో ఆ ప్రాంత వాసులు ఏ జరిగిందోనని ఉలిక్కి పడ్డారు. విద్యుత్ స్తంభం నెలకుంగిన వెంటన్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వ్యాన్ డ్రైవర్ వ్యాన్ అదుపులోకి తీసువచ్చి పక్కనే నిలిపివేశాడు. విద్యుత్ అధికారులు వచ్చి స్తంభాన్ని సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా బ్రూస్‌లీ జయంతి



కలవచర్లలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షుడు అబ్బులు తదితరులు

ఆలమూరు: కలవచర్లలో నున్న మదర్ థెరీస్సా స్పోర్ట్స్ అకాడమీలో బుధవారం మార్షల్ ఆర్ట్స్ సృష్టికర్త బ్రూస్‌లీ జయంతిని నిర్వహించారు. జిల్లా మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షుడు టి.అబ్బులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కూటమి నేతలు సంగిత సుభాష్, సలాది నాగేశ్వరరావు, గుంటూరి సత్యనారాయణ మూర్తి తదితరులు బ్రూస్‌లీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. నేటి యువత మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని పలువురు వక్తలు సూచించారు. అనంతరం కుంగ్‌ఫూ మాస్టర్లు లంకే వెంకటరెడ్డి, ఎస్.సెంథిల్‌కుమార్, నిచ్చెనకోళ్ల సుబ్రహ్మణ్యంను పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు.

ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలి

- ఫీల్డ్ అసిస్టెంట్లు పారదర్శంగా వ్యవహరించాలి
- ఎంపీడీఓ రాజు



ఆలమూరులో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ

ఆలమూరు: ఎన్ఆర్ఈజీఎస్‌లో నమోదు చేసుకున్న ప్రతి ఒక్క కూలీకి ఉపాధి పని కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ ఎం.అరుణకుమారి అధ్యక్షతన బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లె పండగలో గుర్తించిన పనుల ప్రగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటును అందించాలన్నారు. కూలీలకు ఎప్పటికప్పుడు మస్తర్లను రోస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఉపాధి పనుల్లో ఎవరైనా అవినీతికి పాల్పడితే చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిషత్ ఏవో ఎం.మెహర్ ప్రకాష్,, టీసీలు లావణ్య, పి.ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ పివివి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కష్టాలకు కుంగిపోవద్దు



మలికిపురంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్

మలికిపురం: విద్యార్థినులకు ఏదైనా కష్టమొస్తే కుంగిపోకుండా పోలీసులకు చెబితే గోప్యంగా విచారించి పరిష్కరిస్తారని మలికిపురం ఎస్సై పి.వి.వి. సురేష్ పేర్కొన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో విద్యార్థి నాయకులు గణేష్ పోలిశెట్టి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్సై సురేష్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆడపిల్లల సంరక్షణ కోసం అనేక చట్టాలను తీసుకొని వచ్చాయని మీరు వాటిపై అవగాహన పెంచుకుని మీకు ఏ ఇబ్బందీ వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఆడపిల్లలు మీరు సోషల్ మీడియాలో మీ ఫొటోస్, వీడియోస్, వ్యక్తిగత వివరాలు అప్లోడ్ చేయరాదని సూచించారు. ఆడపిల్లలు బైక్స్ నడిపేడప్పుడు ముగ్గురు ప్రయాణించకుండా, అతి వేగంగా వెళ్లకుండా, లైసెన్స్ తో ప్రయాణించాలన్నారు. ఎవరైనా రాగింగ్‌కి పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తే మీ పేరు గోప్యంగా ఉంచి వాళ్ల మీద యాక్షన్ తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీ సుధ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల్లో వాయుగుండం గుబులు

- రానున్న 5 రోజులు తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం
- వరి పంటను కాపాడుకునేందుకు అప్రమత్తం కావాలన్న అధికారులు



మామిడికుదురులో ధాన్యాన్ని ఒబ్బిడి చేసేందుకు గోనె సంచుల్లో ఎత్తుతున్న రైతులు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖరీఫ్ కోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకున్నాయి. ఎక్కడ చూసినా పంట పనలపై ఉంది. ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. కుప్ప నూర్పిడిలు నిర్వహిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఏర్పడిన వాయుగుండం రైతులను తీవ్రంగా కలవర పెడుతోంది. మామిడికుదురు మండల పరిధిలో 2420 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ పంట సాగు చేశారు. ఇంత వరకు 270 ఎకరాల్లో కోతలు పూర్తి అయ్యాయి. 256 ఎకరాల్లోని పంట నూర్పిడి చేశారు. వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో రైతులు కోత యంత్రాలను ఆశ్రయించారు. కోత యంత్రాల ద్వారా జోరుగా కోత కోస్తున్నారు. ఎంతో కష్టపడి పంట సాగు చేశామని, నాలుగు రోజుల నుంచి ఈదురు గాలులు, మోఘాలతో వాతావరణం బయపెడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయనుకుంటున్న తరుణంలో ఈ ఉపద్రవం ఏర్పడిందని వాపోతున్నారు.

రైతులకు రెవెన్యూ శాఖ తుపాను హెచ్చరిక

కొత్తపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం (ఫెంగల్ సైక్లోన్) కారణంగా ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2 వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి రైతులు పంట కోత, ధాన్యం ఒబ్బిడి చేసుకునే విషయంలో అప్రమత్తం కావాలని తహసీల్దార్ వై.రాంబాబు హెచ్చరించారు. ఆ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాయలయంలో రైతులకు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. 5 రోజులపాటు వరి కోతలు కోయడం నిలిపివేయాలని, కోసి ఆరబెట్టిన ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాయంలో కంట్రోల్ రూమ్‌ను (సెల్ 9059461848 నంబర్) సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న రైతులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వరి రైతులు తమ పంటలను కాపాడుకోవాలన్నారు. ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంట కోతలు కోయరాదని సూచించారు. కోతలు కోసి పనలు మీద ఉన్న ధాన్యాన్ని ఉప్పు ద్రావణంతో పిచికారీ చేస్తూ మొలకలు రాకుండా, రంగు మారకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని వెంటనే తమకు నచ్చిన మిల్లులకు తరలించి విక్రయించుకునేలా పౌర సరఫరాల శాఖ పూర్తి సహకారాలు అందిస్తుందన్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లులకు ట్యాగింగ్ చేస్తారని వెంటనే తరలించాలన్నారు. పసుపల్లిలో ఉన్న రైస్ మిల్లుల వద్ద నియమించిన కస్టోడియల్ అధికారులు గోనె సంచులు, హమాలీలు, రవాణా వసతులు కల్పిస్తారన్నారు. జిల్లా జాయింట్‌కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అల్పపీడనం కారణంగా రైతులు, ప్రజలు ఐదు రోజులు పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన



మొండెపులంకలో కార్తిక వన సమారాధనలో పాల్గొన్న భక్తులు



లూటుకుర్రులో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న విద్యార్థులు

మామిడికుదురు: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా లూటుకుర్రు గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. రామాలయం ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద మహిళలు, భక్తులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది.

మొండెపులంకలో..

పి.గన్నవరం: మొండెపులంక గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఆరుమిల్లి వీరభద్రరావు ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఆరుమిల్లి లాల్‌బాబు, పెదబాబు, నాగబాబు, డొక్కా నాథ్‌బాబు పాల్గొన్నారు.